శ్రీరామనవమిని శాంతియుతంగా జరుపుకోవాలి

- నిర్వాహకులకు డీసీపీ సురేశ్‌కుమార్ సూచన

దుండిగల్, ఏప్రిల్ 4: శ్రీరామనవమి వేడుకలను, శోభాయాత్రను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శ్రీరామనవమి ఉత్సవ కమిటీల నిర్వాహకులతో డీసీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, వేడుకలు జరిగే చోట క్యూ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

మియాపూర్: శోభాయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సౌండ్ పొల్యూషన్ చోటు చేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ ఉపేందర్, పలువురు ఎస్సైలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు సన్నాహాలు

మియాపూర్ : శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించనున్న శోభాయాత్రకు సన్నాహాలు చేస్తున్నామని శ్రీరామ భక్త హనుమాన్ హిందూ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు వెల్లడించారు. శుక్రవారం ఆల్విన్ కాలనీ ఫేజ్-1లోని హనుమాన్ ఆలయంలో కార్యవర్గ సభ్యులతో కలిసి శోభాయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం 4 గంటలకు అభయాంజనేయస్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. హిందూ నేతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాము, వెంకటస్వామిరెడ్డి, అభిషేక్, నవీన్, సతీశ్‌తో పాటు శివకుమార్,రామకృష్ణ, ప్రకాశ్, నరసింహారెడ్డి, రాయల్, రమేశ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం శ్రీసీతారాముల చిత్రపటానికి వేదమంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించి, అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీ. గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భీమయ్య, కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో వేడుకల్లో పాల్గొన్న అసోసియేషన్ నేతలు, న్యాయవాదులు

నాలా విస్తరణ పనులను త్వరగా పూర్తిచేయాలి

అధికారులతో కలిసి సబ్దార్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, ఏప్రిల్ 4: మల్లాపూర్ డివిజన్ పరిధి సున్నం చెరువు ఎగువ నుంచి మైసమ్మ చెరువు దిగువకు చేపడుతున్న నాలా విస్తరణ పనులను వర్షాకాలం ప్రారంభమయ్యే లోగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సబీహా బేగం అధికారులకు సూచించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎస్ఎన్‌డీపీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నాలాల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలాల అభివృద్ధి పనులు చేపట్టి 80 శాతం ముంపు సమస్యను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి రాజీవ్‌గాంధీనగర్, సబ్దార్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ముంపు సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులను కోరారు.

భవనం పైనుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జగద్గిరిగుట్ట,ఏప్రిల్ 4: నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పైనుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. జగద్గిరిగుట్ట పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగనూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 లో ఇంటిని నిర్మిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి(35) ఆ ఇంట్లోకి ప్రవేశించి సెంట్రింగ్ సామగ్రి, ఇనుప వస్తువులు దొంగలించే క్రమంలో పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. వాచ్‌మెన్ లింగస్వామి తెల్లవారుజామున పరిశీలించి చూడగా అప్పటికే మరణించాడు. ఇనుప వస్తువుల చోరీకి వచ్చి మద్యం మత్తులో కిందపడి మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు మృతుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీలు

దుండిగల్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమెల్సీ శంభీపూర్ రాజు, మరో ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్ కుమార్ మాజీ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కేపీహెచ్‌బీలో వారాహి సిల్క్స్ ప్రారంభం

వారాహి సిల్క్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హీరో బాలకృష్ణ, హీరోయిన్ మీనాక్షి చౌదరి

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): దుస్తుల ప్రియులకు స్వర్గధామంగా పిలువబడే వారాహి సిల్క్స్ మరొక బ్రాంచ్ శుక్రవారం కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1లో ప్రారంభించింది. ముఖ్య అతిథిగా టాలీవుడ్ నటుడు నందమూరి బాలకృష్ణ, నటి మీనాక్షి చౌదరి పాల్గొని నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. వారితోపాటు నిర్వాహకులు మణిదీప్ ఏచూరి, డాక్టర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 4: గండి మైసమ్మ గణేశ్‌నగర్‌లోనీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ నేత శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు. ప్రత్యేక హోమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో తాజా మాజీకౌన్సిలర్లు మహేందర్ యాదవ్, రాముగౌడ్, సాయియాదవ్, మాజీ సర్పంచ్ ఆకుల నవీన్, బీఆర్ఎస్ మున్సిపల్ బీసీ శాఖ అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్, బొరంపేట పీఏసీఎస్ డైరెక్టర్ జీతయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌ను సమూలంగా నివారిద్దాం..

రిక్షా పుల్లర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ చేస్తున్న రాందేవ్‌రావు వైద్యశాల సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4: మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌ను సమూలంగా నివారించేందుకు రాందేవ్ రావు వైద్యశాల కృషి చేస్తున్నదని వైద్యశాల నిర్వాహకులు విక్రమ్ దేవ్ రావు, మీరారావు అన్నారు. గురువారం కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ వైద్యశాల, కార్నర్ స్టోన్ సాఫ్ట్‌వేర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రిక్షా పుల్లర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో 200 మంది విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలను ఆరోగ్యంగా పెంచితే భవిష్యత్ తరాలు, సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం సాఫ్ట్‌వేర్ సంస్థ రూ. 24 లక్షలను విరాళంగా అందజేసింది. సమాజంలో సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల మెడికల్ డైరెక్టర్ కమలాకర్, ఛాయాదేవి, ప్రశాంత్ రెడ్డి, అపర్ణరావు, సంస్థ నిర్వాహకులు అభిషేక్ గుప్తా, కిరణ్, భార్గవి, నిశిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హర్ష టయోటా మెగా యూజ్డ్ కార్స్, ఎక్స్ఛేంజ్ మేళా

సిటీబ్యూరో, ఏప్రిల్04, (నమస్తే తెలంగాణ): హర్ష టయోటా మెగా యూజ్డ్ కార్స్ అండ్ ఎక్స్ఛేంజ్ మేళాను ఈనెల 4 నుంచి 6 వరకు స్థానిక కృతుంగ రెస్టారెంట్ ఎదుట నిర్వహిస్తున్నారు. కస్టమర్లకు ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్, ఉత్తేజకరమైన ప్రయోజనాలతో అనేక రకాల సర్టిఫైడ్ వాహనాలను అన్వేషించే అవకాశాన్ని అందిస్తుంది.

నాగార్జుననగర్‌లో సమస్యలు పరిష్కరించండి

బాలానగర్, ఏప్రిల్ 4 : ఫతేనగర్ డివిజన్ నాగార్జుననగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ, జల మండలి అధికారులతో కలిసి ఆయన నాగార్జుననగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాగార్జుననగర్‌లో డ్రైనేజీ నిండిపోవడంతో మురుగునీరు వస్తున్నదని, దాంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల మండలి అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ప్రెషర్ మరింత పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నసీర్, సలావుద్దీన్, రెహాన్‌ఖాన్, బషీర్, ఖలీం, అస్లం, గౌస్, జగన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారావును విమర్శించే స్థాయి లేదు..

- కాంగ్రెస్ నాయకుడు బండి రమేశ్‌పై బీఆర్ఎస్ యువనేత ఫైర్

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్‌కు లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జన్ను సాయిశ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రస్తుతం నువ్వు ఉన్న పార్టీలో పరపతి కోల్పోవడం ఖాయమని చెబుతూ.. కొత్త బండి ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నట్లు మీ పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారని పేర్కొన్నారు. గత 30 ఏండ్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావుపై పలు ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపణలు చేయడమే తప్ప నిరూపించలేక పోయారని తెలిపారు. ఏనాడు సేవ చేయని నీవు.. బిల్డర్‌గా అమాయక ప్రజలను మోసం చేస్తూ... ఇల్లు కట్టిస్తారని స్థలాలు రాయించుకొని మోసం చేసిన విషయం ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను మోసం చేస్తున్న నువ్వా నీతులు వల్లించేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేను విమర్శిస్తూ నవ్వుల పాలు కాకుండా ఇప్పటికైనా ప్రజలకు ఏదైనా మేలు చేయాలని ఆయన కాంగ్రెస్ నేత బండి రమేశ్‌కు హితవు పలికారు.

వడ్డెరల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, మార్చి 4: వడ్డెరల సమస్యలను పరిష్కరించాలని వడ్డెరల లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు జేరిపేట సత్యనారాయణ, తెలంగాణ వడ్డెర(గన్ను దెబ్బ)సంఘం అధ్యక్షుడు ఎత్తిరి అంతయ్య అన్నారు. శుక్రవారం వారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వడ్డెరల సమస్యలను వివరించారు. నగరంలో జేసీబీలపై పోలీసులు చాలానాలు అధికంగా విధిస్తున్నారని, దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులు బాగా చదివి వృద్ధిలోకి రావాలి

ప్రగతినగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రామకృష్ణ, అధ్యాపకులు

దుండిగల్, ఏప్రిల్ 4: ప్రగతినగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 4వ తరగతి విద్యార్థులు 5వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సింహులు సభాధ్యక్షుడిగా వ్యవహరించగా ముఖ్య అతిథిగా బాచుపల్లి ఎంఈఓ ఎంవీవీ రామక్రిష్ణ, పీఆర్టీయూ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నర్సింహులు, ప్రమోద్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎంవీవీ రామకృష్ణ మాట్లాడుతూ.. పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. విద్యార్థులు చదువు మధ్యలో మానివేయకుండా క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు తదితరులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

అదృశ్యమైన ఏడుకొండలు(ఫైల్)

కొండాపూర్, ఏప్రిల్ 4 : ఇంటి నుంచి కిరాణా దుకాణానికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా గండ్రేడ్ లంకకు చెందిన రాయుడు ఏడుకొండలు (60) వారం రోజుల క్రితం చందానగర్ డిఫెన్స్ కాలనీలో నివాసముంటున్న కొడుకు రాయుడు సత్యం వద్దకు వచ్చాడు. ఈనెల 2న కిరాణా దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లోంచి వెళ్లిన ఏడుకొండలు తిరిగి రాలేదు. బంధువులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు సత్యం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

అదృశ్యమైన ఢిల్లేశ్వర్‌రావు(ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4: కూలి పనులు చేయడానికి ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో నివసిస్తున్న కొండల ఢిల్లేశ్వర్‌రావు(28) కూలి పనులు చేస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 24న పని కోసం వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. బంధుమిత్రులను విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో.. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన

అడ్డగుట్ట, ఏప్రిల్ 4: దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. డివిజన్‌లోని స్కైలాబ్ హోటల్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లో నెలకొన్న అపరిష్కృత సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు.

సాధారణ విద్యార్థులు సివిల్ సర్వీసెస్ సాధించొచ్చు..



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న భవానీశంకర్

దుండిగల్, ఏప్రిల్ 4: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(విజేఐఎం) కళాశాలలో శుక్రవారం 'మొదటి ప్రయత్నం లోనే సివిల్ సర్వీసెస్ సాధించడం ఎలా? – యూపీఎస్‌సీ మాస్టర్ క్లాస్' సెమినార్ జరిగింది. వింగ్స్ మీడియా, జీ5 మీడియా గ్రూప్ సంయుక్తంగా ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ చీఫ్ మెంటార్, డైరెక్టర్ డాక్టర భవానీశంకర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. యూపీఎస్సీ పరీక్షల్లో సాధారణ డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణులు కావచ్చన్నారు. యూపీఎస్‌సీ ప్రశ్నలు పాఠశాలలో నేర్పించిన ప్రాథమిక సూత్రాల ఆధారంగా ఉంటాయని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్‌ను సమాజంలో మార్పు తీసుకురావడానికి ఒక అవకాశంగా భావించాలని అభ్యర్థులకు సూచించారు.

వీజేఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ భారత భూషణ్‌సింగ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ప్రముఖ యూపీఎస్సీ కోచింగ్ హబ్‌గా గుర్తించి, ఢిల్లీ ఆధిపత్యాన్ని తగ్గించినట్టు తెలిపారు. సెమినార్‌లో వీజేఐఎం అకడమిక్ డీన్ డాక్టర్ రవినాథ్, అకడమిక్స్ హెడ్ డాక్టర్ పద్మజ, పీఆర్వో కె. గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమతానగర్‌లో ముంపు సమస్యను పరిష్కరించరూ!

సమతానగర్‌లో ఓ ఇంటి ముందు చేరిన వర్షపునీరు

బాలానగర్, ఏప్రిల్ 4 : ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధి సమతానగర్‌లో ముంపు సమస్య కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. వర్షాలు పడ్డాయంటే ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జనం మోకాలు లోతు నీటిలో నుంచి నడిచి వెళ్లాలిందే. కాలనీలో 15 ఏండ్ల క్రితం వేసిన వరద కాల్వ ప్రస్తుతం మట్టితో నిండిపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు రోడ్లపైకి వస్తున్నది. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి సమతానగర్ రోడ్లపై వరద నీరు చేరడంతో ఇళ్ల ముందు పార్క్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు నీటిలో సగం వరకు మునిగిపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో ఎలా ఉంటుందోనని పలువురు కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సమతానగర్ కాలనీ సమస్యను గుర్తించి జీహెచ్‌ఎంసీ అధికారులు శాశ్వత పరిష్కారం కోసం తక్షణమే బాక్స్‌డ్రైన్ నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాగా శుక్రవారం శానిటేషన్ సిబ్బంది డ్రైన్ వాటర్ నాలాను శుభ్రం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మాదాపూర్, ఏప్రిల్ 4: ఫీడర్ మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. మార్తాండనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయక్‌నగర్, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు, హఫీజ్‌పేట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ప్రకాశ్‌నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు, హనుమాన్ టెంపుల్ 11 కేవీ ఫీడర్, ప్రేమ్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

అదేవిధంగా అల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌ను శనివారం తాత్కాలికంగా నిలిపివేయనన్నట్లు ఏఈ రాకేశ్ తెలిపారు. హ్యుందాయ్-2 11 కేవీ ఫీడర్ పరిధిలోని మేరిడియన్ స్కూల్ ఏరియా, ఎస్ కన్వెన్షన్ మార్గం, బుట్ట కన్వెన్షన్ రోడ్, సూర్య పేపర్ కార్యాలయం సమీపం నుంచి సలీం టీ స్టాల్ వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఎస్‌బీఐ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని ఆర్ ఆర్‌ఆర్ వైన్స్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, కైతలాపూర్ బ్రిడ్జి సమీపంలో, చందానాయక్ తండా ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సాయినగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని సాయినగర్ ఏరియా, రోడ్ నంబర్ 52 నుంచి 60 వరకు, అయ్యప్ప సొసైటీ పార్క్ సమీపంలో, బొల్లినేని అపార్టమెంట్స్ సమీపంలో, స్విమ్మింగ్ పూల్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 8:30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వసంతనగర్ సబ్ డివిజన్ పరిధిలో..

కేపీహెచ్‌బీ కాలనీ : వసంతనగర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు గోకుల్ ఫ్లాట్స్, వినాయక పార్క్ కాలనీ, వెంకటరమణ కాలనీ, సాయి హిల్స్, ప్రజయ్ మెగా పోలిస్, గోపాల్‌నగర్, సాయినగర్, సర్దార్ పటేల్‌నగర్, వసంతనగర్, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2 పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పలు ఫీడర్ల పరిధిలో..

మియాపూర్ : అడ్డగుట్ట, శ్రీరామ్‌నగర్ 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షాబాజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్డగుట్ట రోడ్ నంబర్ 1 నుంచి 7 వరకు పేజ్-2, భాగ్యనగర్ ప్రాంతాలు, వెస్టర్ హిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని వెస్టర్న్ హిల్స్, ఫేజ్-3, భాగ్యనగర్, అడ్డగుట్ట ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 3 30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో 'కాశ్మీర్ టు కన్యాకుమారి' చిత్రప్రదర్శన

ప్రదర్శనలోని చిత్రాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే వివేక్

కొండాపూర్, ఏప్రిల్ 4 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ చిత్రకారుడు కళాయాత్ర పోచం 'కాశ్మీర్ టు కన్యాకుమారి' డ్రాయింగ్స్ సోలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. చిత్ర ప్రదర్శనను చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలోని చిత్రాలను హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ రమణారెడ్డితో కలిసి తిలకించారు. ప్రదర్శనలో చిత్రకారుడు పోచం వేసిన 450 లైవ్ డ్రాయింగ్స్‌ను ఈనెల 10వ తేదీ వరకు ప్రదర్శనలో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4 : కూకట్‌పల్లి(కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జిమిర్చి 23, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి10, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యారెట్ 18, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 55, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 19, క్యాప్సికం 40, ఆలుగడ్డ 24, కీర 18, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ